


# హేమంత తుషారం

వాలి హిరణ్మయీదేవి

"ఆంటీ! ఆంటీ! అంకుల్ లేరా?" అంటూ లోపలికి దూసుకు వచ్చింది వాణి.

ఏకదీక్షగా స్వెటర్ అల్లుతున్న హేమంత ఒక్కసారి తలెత్తి చూసింది.

"ఇప్పుడే ఆఫీసుకి వెళ్లారు. ఏం పని పడిందేమిటి ఆయనతో?" చిరునవ్వుతో అడిగిందామె.

"అయ్యో...! కాస్త ముందైనా రావాల్సింది ... ప్చ్.... ఈవెనింగ్ ఐదున్నరకి వచ్చేస్తారుగా!" అంది డిజప్పాయింట్ అవుతూ.

"దేనికి?" మళ్లీ రెట్టించింది హేమంత.

"ఈవారం తెలుగు వెలుగు మాగజైన్ వాళ్లు కథలపోటీ పెట్టారు. నేను రాసిన కథ అంకుల్‌కి చూపించి ఏమన్నా కరెక్షన్స్ ఉంటే చేయించాలనుకున్నాను!" అంది వాణి.

"నే చూస్తాను, ఆ కథ పట్టుకురా!" అంది హేమంత ఆ పిల్ల మొహం వేలాడేసుకుని పోతుందని.

"మిరా! మీకేం తెలుస్తుందీ ...? అంకుల్ అయితే ..." అంటూ నసిగింది వాణి.

ఆ మాట వింటూనే హేమంతకి ఎక్కడలేని దిగులు ముంచుకొచ్చింది.

"అంకుల్ రాగానే చెబుతాను, అప్పుడు తీసుకురా!" అంది తేరుకుని.

"సరే!" అంటూ వచ్చినంత హడావుడిగా వెళ్లిపోయింది వాణి.

ఆ పిల్లనే చూస్తూ దీర్ఘంగా నిట్టూర్చింది హేమంత. ఒకప్పుడు తనూ ఇలాగే సన్నజాజి తీగలా, సౌందర్యానికి ప్రతీకలా ఉండేది. ప్రపంచంలోని ఆనందం, చలాకీతనం తన సొత్తే అంటూ తిరిగింది. "సెలయేటి గలగలలు, పరుగులు గుర్తుకు వస్తాయి, నిన్ను చూస్తే!" అనేవాడు తుషార్. ఏమైంది ఆ చలాకీతనం?

ఇప్పుడు తనకంటూ ఓ అస్తిత్వం లేదు, వ్యక్తిత్వం లేదు. పక్కా గృహిణిలా మారిపోయింది. తను ఒకప్పుడు పేరుగాంచిన రచయిత్రి అని పక్కింట్లో ఉన్న పిల్లకు కూడా తెలియనంతగా! .... ఒక్కసారి మనసంతా బరువుగా అయిపోయింది హేమంతకి. గతం కళ్లముందు సజీవంగా కదలాడసాగింది.

***

"పోస్ట్!" అంటూ పోస్ట్‌మాన్ ఇచ్చిన కవర్లను అందుకుని లోపలకు వెళ్లింది హేమంత. తండ్రి పేరున వచ్చిన రెండు లెటర్స్‌ని టేబుల్‌పై ఉంచి, మిగిలిన కవర్స్‌ని పట్టుకుని బెడ్రూమ్‌లోకెళ్లి తీరిగ్గా వాటిని చూస్తూ కూర్చుంది.

మొదటగా నీలిరంగు కవర్‌ని, దానిపై ఉన్న దస్తూరినీ చూస్తూనే, ఆమె పెదాలు చిరునవ్వుతో విచ్చుకున్నాయి. వెంటనే ఆ కవరు ఓపెన్ చేసింది.

"డియర్, హేమంతా! కంగ్రాట్యులేషన్స్! ఉగాది కథల పోటీలో ఫస్ట్‌ప్రైజ్ కొట్టేసినందుకు. నా అభిమాన రచయిత్రికి బహుమతి రావడం.. నిజంగా నాకే వచ్చినంత ఆనందం కలుగుతోంది. ఈ ఆనందాన్ని ఇంకా ఇంకా వర్ణించాలంటే మాటలు చాలవు. కథతోపాటు ప్రచురించిన మీ ఫొటో చూసి థ్రిల్లయిపోయాను. ఇన్నేళ్లూ ఒక్క కథ మీ ఫొటోతోబాటు ప్రచురించబడకపోతే సామాన్యంగా ఉంటారనుకున్నాను. అలాంటిది ఇంత చిన్న వయసు అమ్మాయా అన్న ఆశ్చర్యంతోబాటు డైలమాలో పడిపోయాను. కథ బాగుందా, లేక ఫొటోనే బాగుందా అని. బాపూ బొమ్మకు ప్రాణం వస్తే అది మీరే! సారీ ... ఎక్కువగా రాస్తున్నానా? ఆడపిల్లకు వ్యక్తిత్వం ముఖ్యమంటూ తేల్చి చెప్పిన ఆ కథ నిజంగా ఒక ఆణిముత్యం.

"మీరు రాసే లెటర్స్ అన్నీ ఓ ఫైల్‌లో దాచుకుంటున్నాను. నేనూ అప్పుడప్పుడూ కొన్ని కథలు రాశాను. అవి మీకు చూపించాలని ఉంది. మళ్లీ అంతలోనే 'అవీ ఒక కథలేనా!' అని వెక్కిరిస్తారేమోనని భయంగానూ ఉంది. వచ్చే నెల్లో నేను ఏకంగా హైదరాబాద్‌కి వచ్చేస్తున్నాను ట్రాన్స్‌ఫరవడంవల్ల. ఇక మిమ్మల్ని రోజూ కలవవచ్చన్న ఆనందం కలుగుతోంది. ఆఁ...ఆఁ... భయపడకండి! రోజూ వచ్చి డిస్టర్బ్ చెయ్యనులెండి! వారానికోసారి రావడానికి, కనీసం ఓ గంటయినా మీతో మాట్లాడే అదృష్టాన్ని కలగజేయమని కోరుకుంటున్నాను. మా ఫ్రెండ్సంతా నన్ను ఒకటే ఆకాశానికి ఎత్తేస్తున్నారు. మీ ఊరికే ట్రాన్స్‌ఫరైనందుకు. నాకైతే ఈ నెల ఎంత వేగంగా అయిపోతుందా అని తెగ ఆత్రంగా ఉంది. ఇక ఉండనా ...

"మీ లెటర్ కోసం ఎదురు చూస్తూ ...

"తుషార్."

తర్వాత మిగతా లెటర్స్ విప్పి చూసింది. అందులో కొన్ని అభినందిస్తూ రాసినవైతే, మిగతావన్నీ మాత్రం తన అందాన్ని ప్రశంసిస్తూ వచ్చినవే. కొంచెం గర్వం కలిగింది హేమంతకి. ఇంతమంది మెచ్చుకునే అందమా తనది అనుకోగానే.

ఏనాడూ అందచందాల టాపిక్ జోలికి వెళ్లని తుషార్ కూడా సింపుల్‌గా అభినందించింది తలుచుకుంటుంటే మరింత పరవశం కలిగింది. ఎందుకో మొదటినుంచీ అతని లెటర్స్‌పట్ల చెప్పరాని ఇష్టం కలిగిందామెలో. అతడు ఫ్రెండ్లీగా రాసే తీరుపట్లనో, అమాయకంగా అడిగే ప్రశ్నలకు ముచ్చటపడుతూనో తనూ లెటర్స్ రాయడం మొదలుపెట్టింది. దాదాపు రెండేళ్లవుతున్నా కథలు, సినిమాలు మిగిలిన కబుర్లే గానీ, ఒకరి స్వంత విషయాలపట్ల మరొకరు ఇంట్రస్ట్ చూపించలేదింతవరకూ. అతను ఎల్.ఐ.సీ.లో జాబ్ చేస్తాడని మాత్రమే తనకు తెలుసు. ఎలా ఉంటాడో తుషార్ ....? అన్న ఊహ మొదటిసారిగా కలిగింది హేమంతలో.

'ఇంకెంత...! నెలలో చూడబోతున్నాను' అనుకోగానే ఆమె మనసు చిత్రంగా స్పందించింది.

***

హేమంత ఆఫీసు నుండి వచ్చేసరికి తండ్రి ఎవరితోనో మాట్లాడుతూండటం గమనించింది.

"పాపం, అతని పని అయిపోయినట్లే!" అనుకుంది. చిరాకుగా ఉండటం వల్ల స్నానం చేసి, చిన్న నీలంపూవులున్న తెల్లటి నైటీ వేసుకుని వంటింట్లోకెళ్లింది.




ఏంటి, సౌమ్య, ఏమంటున్నావు? మన పెళ్లి జరగదా? ఏమైంది నీకు? నీవులేకుండా నేను జీవించగలనా? దయచేసి అలాంటి మాటలు మాట్లాడొద్దు. ఏ కారణం చెప్పకుండా నేను నిన్ను పెళ్లి చేసుకోనని అంటున్నావు. నీకేమైనా పిచ్చి పట్టిందా? ఎలాంటి పరిస్థితుల్లోనైనా సరే, నిన్ను పెళ్లి చేసుకుని తీరతాను. నీకు నామీద ఎంత ప్రేమ ఉందో నాకు తెలుసు. అలాగే నా ప్రేమగురించి నీకు తెలుసు.

నిమ్మకాయ కోసి తనకోసం షర్బత్ కలుపుకుని తాగుతూ కిటకీగూండా హాలులోకి యాథాలాపంగా చూసింది. తండ్రి వీరభద్రంలా వాయిస్తుంటే, మొహమాటపడుతూ బిక్కచచ్చి కూర్చున్న ఆ యువకుడు కనిపించేసరికి ఎక్కడ లేని నవ్వొచ్చింది. 'అమ్మ పోయాక పాపం, నాన్న ఒంటరివాడయ్యాడు. మనిషి దొరికిందే పాపం అన్నట్లు దొరికినవాడికి సుత్తి వేయడం అలవాటు చేసుకున్నాడు. ఈ రోజు పాపం, ఈ అభాగ్యుడు దొరికాడులా ఉంది. పాపం, ఇంత షర్బత్ అయినా ఇస్తే సరి, మనిషి కోలుకుంటాడు!' అనుకుంటూ మరో నిమ్మకాయ కోసి, షర్బత్ చేసి రెండు గ్లాసుల్లో పట్టుకెళ్లింది. అతడు హేమంతని చూస్తూనే,

"నమస్కారమండీ! నా పేరు తుషార్" అన్నాడు గబగబా.

"ఓహ్...! మీరా! కూర్చోండి, ఎప్పుడొచ్చారు?" అంది హేమంత.

"ఏంటమ్మా ... ఈ అబ్బాయి నీ కోసం వచ్చాడా? మరి రాజారావు కొడుకువేనా అంటే అవునన్నాడే?" అన్నాడు జగన్నాథం.

"మా నాన్నగారి పేరు రాజారావేనండీ."

"మరి ఊరడిగితే రాజమండ్రన్నావుగా!"

"మా ఊరు రాజమండ్రేనండీ మరి!" అన్నాడతను బెదురుగా.

ఇక తను కల్పించుకోకపోతే ఈ ప్రహసనం మరో అరగంటవరకూ సాగిపోతుందని ... "నాన్నా! ఈయన నా పెన్ ఫ్రెండ్. నన్ను కలవడానికొచ్చారు!" అంది హేమంత.

"మరా ముక్క చెప్పందే!" అన్నాడు జగన్నాథం కాస్త అసంతృప్తిగా. అతనికింకా మాట్లాడాలని ఉందాయె.

'ఆ ముక్క చెప్పనిస్తేనా?' అనుకున్నాడు మనసులో తుషార్.

"అలా రీడింగ్ రూమ్‌లో కూర్చోండి, వస్తానిప్పుడే!" అంటూ లోపలికి వెళ్లి నైటీ తీసేసి, చీర కట్టుకుని వచ్చింది హేమంత.

"మీరు హేమంతగారి అక్కగారాండీ?" అన్నాడు తుషార్.

"ఏమిటీ, జోకా? నేనే హేమంతని!" అంది హేమంత.

'ఇందాక చిన్నపిల్లలా కనిపించినమ్మాయే, చీరలో ఎంత హుందాగా ఉందో?' అని అనుకోకుండా ఉండలేకపోయాడు తుషార్.

"పాపం, మా నాన్నగారు మీ బ్రెయిన్ తినేశారులా ఉందే!" అంది నవ్వుతూ హేమంత.

నవ్వితే ఆమె అందం మరింత విజృంభించిందే అనుకున్నాడు మళ్లీ తుషార్.

"ఇంకా ఈ లోకంలోకి రాలేదులా ఉందే ... సారీ! మా నాన్నగారికిదో అలవాటు. ఒంటరితనంతో బాధపడుతూంటారు. అందుకే ఇలా దొరికినవాళ్లతో ..."

"ఆం... మరేం ఫరవాలేదు. మీ అమ్మగారు ఊళ్లో లేరాండీ!" అడిగాడు తుషార్.

"ఈ లోకంలోనే లేరు!" భారంగా చెప్పింది హేమంత.

"ఓహ్... సారీ! మీకూ నాలాగే నన్నమాట!"

"ఓ..... రియల్లీ ఐ యామ్ సారీ! మీ బాధను గుర్తుచేశానులా ఉంది."

చిత్రంగా వారిద్దరి బాధ ఒకటే కావడంవల్ల కాబోలు, ఒకరికొకరు కొత్తగా అనిపించలేదు. మాటలకోసం తడుముకునే పనిలేకుండా గలగలా మాటలు సాగిపోయాయి.

అలా పరిచయం ప్రణయానికి దారితీసి పరిణయం జరిపించింది.

"నేను చేస్తున్న ఉద్యోగంతో మనిద్దరం ఈజీగా బతుకుతున్నాంగా? నువ్విలా అలసి సొలసి రావడం నాకు బాధగా ఉంది, హేమంతా!" అన్నాడోసారి.

ఆ మర్నాడే జాబ్‌కి రిజైన్ చేసింది. తుషార్ అన్నాడనే కాదు, ఆ జాబ్ మరొకరి ఆకలి తీరుస్తుందని.

తుషార్‌కి రచయిత ననిపించుకోవాలన్న కోరికని గమనించి, అతనిలోని రచయితని మేల్కొలిపి పదునుపెట్టి, వెన్నుతట్టి ప్రోత్సహించింది హేమంత. అతను రాసే కథలను సరిదిద్దడం, ఫెయిర్ చేయడం, వివిధ పత్రికలకి పంపడం చేసేది. క్రమక్రమంగా రచయితగా పుంజుకున్నాడతను.

పూర్తిగా ఇంటికి, అతనికి అంకితం అయిపోయింది హేమంత.

అతనికి పేరు వస్తున్నకొద్దీ వచ్చే ఉత్తరాల సంఖ్య, ఫోన్ల సంఖ్య పెరగసాగింది. ఆ లెటర్స్‌కి రిప్లై ఇవ్వడం, ఫోన్ కాల్స్ నోట్ చేసుకోవడం, అతడికి వెరైటీగా సబ్జెక్ట్స్‌ని వెతికి అందించడం వీటితో తనో రచయిత్రి నన్న మాటే మరిచిపోయింది. తను రాస్తే ఒకటీ, తుషార్ రాస్తే ఒకటీనా ... అనుకుంది.

ఇలా ఆదర్శ గృహిణిగా మారుతుంటే తుషార్ కమర్షియల్ రచయితగా మారసాగాడు. తను చదివే ఇంగ్లీషు నవలల స్ఫూర్తితో నవలలు, సీరియల్స్ మొదలెట్టాడు. గ్రంథచౌర్యం తప్పు కాదా అంటూ హేమంత నిలదీస్తే ... ప్రజలకు అన్నిరకాల సాహిత్యాన్నీ అందించడం గ్రంథచౌర్యమెలా అవుతుందన్న వాదనతో ఆమె నోరు మూయించాడు. అదీగాక ఎడిటర్ల నుండి, పాఠకుల నుండి వస్తున్న రెస్పాన్స్ చూపించి, తను చేస్తున్నది కరెక్టేనని వాదించేవాడు. దాంతో హేమంత మౌనాన్ని ఆశ్రయించక తప్పలేదు. ఈలోగా పిల్లలు ... వాళ్ల పెంపకంతో అన్నీ పక్కన పడేసింది.

ఎప్పుడన్నా పాత పరిచయస్తులు "కథలు రాయడం మానేశావేమిటి?" అని అంటే, "ఎక్కడా ... టైమ్ ఉండటంలేదు!" అనడం అలవాటు చేసుకుంది.

అమ్మాయిల పెళ్లిళ్లు, అబ్బాయికి ఉన్నతోద్యోగం, తుషార్ బిజినెస్‌లో పైకి రావటం .. అన్నీ చకచకా జరిగిపోయాయి.



ఎప్పుడన్నా అరుదుగా లభించే ఏకాంతంలో నిద్రకు దూరమైనప్పుడు తిలక్ కవితే గుర్తొచ్చేది

"నిద్రకు వెలియై నే నొంటరినై
నా గది లోపల చీకటిలో
చీకటి లోపల నా గదిలో" ఇలా

మిగిలిపోవాల్సిందే అనుకునేది.

ఆ బాధ వదలేక ఎప్పుడన్నా ఏదన్నా రాద్దామనుకునేసరికి విఘ్నేశ్వరుడి పెళ్లికి వెయ్యి అంటకాలన్నట్లు అప్పుడే ఫ్రెండ్స్, బంధువులో రావటం, లేదా ఎక్కడికైనా వెళ్లవలసి రావడం, పిల్లల అనారోగ్యం .... ఏవో అనుకోని పనులతో కుదిరేదే కాదు. సాహిత్య కృషి ఓ తపస్సులా చేయాలి గానీ, ఉబుసుపోకనో, మరోదానికో చేయాలంటే కుదిరేదేనా అనుకుంటూ డిప్రెషన్‌కి లోనయ్యేది.

ఒకప్పుడు తనలోని చిన్న మార్పునిట్టే పసిగట్టే తుషార్ తన పనులతో, బిజీతో తనెలా ఉందో, తన మనసెలా ఉందో పట్టించుకోకపోవడంతో కూడా నిర్లిప్తంగా తయారైంది.

ఒకప్పుడు యువ రచయిత్రిగా ఎంతో పేరు సంపాదించిన, ఎంతో గుర్తింపుని పొందిన హేమంత ఈనాటి పాఠకులకు ... అంతెందుకు పక్కింటి పిల్లకు కూడా తెలియకుండా అయింది. ఆ బాధే ఆమె మనసునెప్పుడూ ముల్లులా పొడుస్తూంటుంది. అందుకే ఏ లోటూ లేకున్నా మనసులో ఏదో అసంతృప్తి.

ఒకోసారి తను ఫుల్‌టైమ్ రచయిత్రిగా మారి సన్మానాలందుకుంటున్నట్లు కలలు కనేది. అంతలోనే అదంతా నిజం కాదని నిట్టూర్పులు ...


ఇందుకే కాబోలు ఆత్రేయ అంత అద్భుతంగా రాశాడు

"ఊహల ఉయ్యాలవే మనసా
మాయల దయ్యానివే
లేనిది కోరేవు, ఉన్నది వదిలేవు
ఒక పొరపాటుకి యుగములు పొగిలేవు ... "

తనే చేజేతులా రచనా వ్యాసంగాన్ని వదులుకుని బాధపడటం ఏమిటి? పిచ్చి కాకుంటే ... అని సరిపెట్టుకోవడం నేర్చుకుంది.

"హేమూ... హేమూ.... హేమంతా!" అంటూ అరుస్తున్న తుషార్ అరుపులకు ఒక్కసారిగా ఈ లోకంలోకి వచ్చింది హేమంత.

"అబ్బా ... ఎదురొచ్చేంతవరకూ అరుస్తూనే ఉంటారా? మొన్న మీరు అలా పిలుస్తూంటే ఎదురింటావిడ నవ్వింది, తెలుసా?" అంది అతని చేతిలోని బ్రీఫ్‌కేసునందుకుంటూ.




"నవ్విపోదురు గాక నాకేటి వెరపు? ఆఁ... రేపు అర్జంటుగా వైజాగ్ వెళ్లాలి, అన్నీ సర్దు!"

"ఏం, మీ పాత స్నేహితులని కలుద్దామన్న కోరిక కలిగిందా?" అంది హేమంత.

"అదేం కాదు, రచయితల వర్క్‌షాప్ ఒకటి పెట్టారుగా! రేపెల్లి మాట్లాడాలిట. నేర్పితే వచ్చేదేనేమిటి రచన...?" అంటూ నేరుగా బాత్రూమ్‌లోకి వెళ్లిపోయాడు తుషార్.

మ్రాన్పడిపోయింది హేమంత. ఇంగ్లీషు మీడియం మూలంగా తెలుగులో ఎన్నో తప్పులు రాసేవాడు. తను వాటిని దిద్దుతూ అతని తెలుగుని ఇప్పటివరకూ కూడా సరిచేస్తూ వచ్చిందే ...! తను వెనుక నిలబడి ఎంతగా నేర్పింది ... ఎక్కడ కామా, ఫుల్‌స్టాప్ పెట్టాలో తెలియని అతనకి ఇంత పేరొచ్చేలా చేసిందే ... అవన్నీ మరిచిపోయాడా?

'ఛీ... తుషార్ మారిపోతున్నాడు!' అనుకుంది దిగులుగా.

"ఏంటోయ్, మన్నుతిన్న పాములా అలాగే నిలబడ్డావ్! హేమూ! నీవు ఎప్పుడూ దిగులుగా, ఏదో పోగొట్టుకున్నట్టుంటావేం? ఏ ఫంక్షన్‌కి రమ్మన్నా రావు, ఎవరితోనూ కలవవు. ఎందుకిలా?" అన్నాడు చిరాకుగా.

అవే మాటల్ని కాస్త స్మూత్‌గా అడిగితే ఏం సొమ్ము పోతుంది? తన మనసులోని ఆవేదన నంతా విప్పి చెప్పదూ ... అనుకుంది.

"ఏమిటి? మూగనోము పట్టావా? వైజాగ్ నుండి నీకేం తీసుకురానూ?"

"ఏమీ వద్దు, మీరు తొందరగా వచ్చేయండి, చాలు!"

"నిన్ను చూస్తుంటే ఒక్కోసారి ఆశ్చర్యంగా ఉంటుంది ఆడదానివేనా అని!"

"ఏం?" ఉలిక్కిపడుతూ అడిగింది హేమంత.

"అవును, మరి! ఆడాళ్లంతా నగలు కావాలని, చీరలు కావాలని సతాయిస్తారని అంటారు కదా! నీకై నువ్వు నోరు విప్పి ఏదన్నా అడిగావా మరి?"

"సర్లెండి, ఆ అడగటం అంటే గుర్తొచ్చింది. ఇందాక పక్కింటి అమ్మాయి మిమ్మల్ని కలవాలంది ఏవో కథలు పరిశీలించాలట మీరు!"

"బాబోయ్! ఆ పిల్లని తల్చుకుంటే ఇంటికి రావడానికే భయం వేస్తూంటుంది. ఆ పిల్ల కథ చదివితే తెలుగులో ఎన్ని అక్షరాలున్నాయో, వత్తులున్నాయో లేవో మర్చిపోవాల్సి వస్తుంది!"

ఏమీ మాట్లాడలేదు హేమంత.

ఒకప్పుడు తనూ ఇలాగే అనేవాడు భయంతో 'బాబోయ్! కథలో ఇన్ని కరెక్షన్స్ ఉన్నాయా? అయినా, అదేమిటండీ బాబూ! తెలుగులో ఇన్ని వత్తులు' అంటూ. ఆ రోజుల్ని అంత త్వరగా ఎలా మరిచిపోగలిగాడు?

ఏ ఒక్కరోజన్నా 'హేమూ! నీ మూలంగానే నాకో రచయితగా ఇంత పేరొచ్చింది!' అంటాడేమోనన్న ఆశ. తనేం పేరు కోసమని ఆశించడంలేదు. తుషార్‌లో ఆపాటి మానవత్వపు విలువలు ఉండాలని ఆశిస్తోంది. అంతే.


"ఏమిటి తల్లీ ... మళ్లీ ఏ లోకాలకి వెళ్లావు! నాతోపాటు రారాదూ, కాస్త ఛేంజ్‌గా ఉంటుంది!" అన్నాడు తుషార్.

ఒక్క క్షణంపాటు వెళ్లాలనిపించినా, డెలివరీకని ఇంటికి రాబోతున్న రెండో కూతురు గుర్తొచ్చింది. దాంతో ఆ ఆలోచనకి స్వస్తి

## శ్రీదేవి హస్తం

బోనీకపూర్ తీయబోయే కొత్తచిత్రంలో హృతిక్‌రోషన్‌తో ఈశాదేవల్ నటించబోతున్నట్లు వార్త వచ్చింది. కానీ డేట్లు కుదరకపోవడంవల్ల హృతిక్ ఈ చిత్రంలో నటించలేకపోయాట్ట. అందుకని అఫ్తాబ్‌శివ్‌దాసానీని హీరోగా తీసుకున్నారు. ఈ చిత్రంలో జయాబచ్చన్ కూడా నటిస్తున్నారు. ఈ చిత్రం పేరు 'కోయీ మేరే దిల్ సే పూఛే.' సంజయ్‌కపూర్ నెగెటివ్‌పాత్ర పోషిస్తున్నాట్ట. నిజానికి ఈ చిత్రంలో హీరో ఎంపికలో శ్రీదేవి చేయివున్నట్లు తెలుస్తూంది. తన కూతురి తొలిచిత్రం నేటి హీరో హృతిక్ అయ్యుండాలని హేమమాలిని చాలా ఆశపడిందట. కానీ శ్రీదేవి మాత్రం తమ చిత్రంలో అఫ్తాబ్‌నే హీరోగా వుంచాలని పట్టుబట్టిందట. విషయం ఇదని తెలిశాక హేమా, శ్రీదేవీ మాటామాటా అనుకున్నట్లు కూడా వినవస్తూంది. ఏమైనా, బోనీకపూర్, శ్రీదేవి భర్త కనుక, భార్య మాటకాక తన మాట వింటాడా ఏం, అనుకుని హేమ ఊరుకుండిపోయిందట పాపం! ఇంకేం చేస్తుంది?

ఎస్.



చెప్పింది. కానీ మనసు అరకువేలీ అందాలను మిస్సవుతున్నందుకు విలవిలలాడింది.

ఏమిటి? తనకోసం తను బతికేందుకు టైమ్ లేకపోతున్నదేమిటి? ఆడపిల్లల పెళ్లిళ్లు, పురుళ్లు, కొడుకు ఉద్యోగం ... మామగారి సేవలు, వచ్చేపోయే ఆడపడుచులు, వారి కుటుంబాల బాగోగులు ... వీటికి వెచ్చించే సమయం తనకో ఉనికి ఉందన్న సంగతినే విస్మరించేలా చేస్తోంది.

ఈ మమకారాల వలలోనుండి తనెప్పటికైనా విముక్తురాలవుతుందా?

"వంట మనిషిని పెట్టుకోమంటే పెట్టుకోవు, సుఖపడటం చేతకాదోయ్!" అంటాడు తుషార్. నిజంగానే చేతకాదా? తన చేత్తో వండి తినిపించడంలో తనకో తృప్తి ఉంది. ఆ చిన్న తృప్తిని కూడా ఎందుకు దూరం చేసుకోవాలి?

ఈయనగారికి సేవలు చేస్తూ, ఇంట్లో పనులు సవరిస్తూనో, గార్డెనింగ్ చేస్తూనో ఎప్పుడో ఓరోజు తను గుటుక్కుమంటుంది. అప్పుడేమవుతుంది?

'ఫలానా రచయితగారి భార్య, లేదా ఫలానా ఆఫీసర్ గారి తల్లి ఈ రోజు కన్ను మూశారు' అని పేపర్లో వస్తుంది కాబోలు!

తన అవసరం పిల్లలకంతగా లేదిప్పుడు. తుషార్‌కి స్టడీ రూమ్‌లోకెళ్లినప్పుడు మాత్రం గుర్తుకొస్తానేమో తనుండదు. అంతే! ప్రపంచం యథాతథంగా ఉంటుంది. ... అలా అనుకోగానే ఎక్కడలేని దుఃఖం ముంచుకొచ్చిందామెకి. అది తుషార్ ఎక్కడ గమనిస్తాడోనని కిచెన్‌లోకి వెళ్లిపోయింది ఎంతో పనున్నట్లు.

***

మార్కెట్‌కి వెళ్లి కూరగాయలు, పళ్లు తీసుకుని దూరంగా పార్క్ చేసి ఉన్న తమ కారు దగ్గరకు హేమంత వస్తూండగా అడ్డంగా పరుగెత్తుకొస్తున్న పిల్లాడ్ని తప్పించబోయిన స్కూటరిస్ట్ హేమంతకు డాష్ ఇవ్వడంతో ఆమె వెళ్లి పక్కనున్న పెద్ద బండరాయిమీద పడటం, తలకి గాయం అవడంతో స్పృహ కోల్పోవడం నిముషాలమీద జరిగింది.

తెలివొచ్చి చూసేసరికి హాస్పిటల్లో ఉంది. చుట్టూ కూతుళ్లిద్దరూ, అల్లుడూ కనిపించారు. హేమంతకి తెలివి రావటం, అందర్నీ గుర్తుపట్టడం చూసిన డాక్టర్ "అదృష్టం బాగుంది. మీకు యాక్సిడెంట్ చేసిన వ్యక్తి మీ అభిమానట! మిమ్మల్ని గుర్తుపట్టి వెంటనే హాస్పిటల్లో జాయిన్ చేయబట్టి సరిపోయింది. లేకుంటే అధిక రక్తస్రావం జరిగి ప్రమాదం ముంచుకొచ్చేది. అతడు మిమ్మల్ని గుర్తుపట్టడం వల్ల లక్కీగా గండం తప్పింది!" అంటున్న డాక్టర్ మాటలకాశ్చర్యపోయింది హేమంత.

ఏం వింటోంది తను? తననింకా ఎవరో ఒకరు గుర్తు పట్టారా? తనకింకా ఓ గుర్తింపు ఉందా? ఎన్నో ఏళ్ల తర్వాత సజీవమైన చిరునవ్వు ఆమె పెదాలమీదకు అలవోకగా వచ్చి నర్తించింది.

ఓ మధ్యవయస్కుడు ముందుకొచ్చి "నేను కాలేజీలో చదివే రోజుల్లో మీరు నా అభిమాన రచయిత్రి. ఏళ్లు గడిచినా మీ మొహంలో ఎలాంటి మార్పు రాకపోవడం నా అదృష్టం. గుర్తు పట్టగలిగాను. నా అభిమాన రచయిత్రిని కలుసుకున్నందుకు ఆనందించాలో, ఆ యాక్సిడెంట్‌కి కారణమైనందుకు బాధపడాలో తెలియడంలేదు!"

తలంతా బాధగా ఉన్నా, హేమంత మొహంలో తెలియని వెలుగు వచ్చి చేరింది. తననింకా పాఠకులు గుర్తుపెట్టుకున్నారన్న ఆనందోత్సాహం ఆమెచేత తిరిగి కలం పట్టిస్తుందని ఆశించేలా చిరునవ్వు పూర్ణహాసంగా మారింది.

ఆమె కోలుకోవడం, తమని గుర్తుపట్టడం ఆనందాన్ని కలిగించినా, ఆమెలోని మార్పు చూపరులకి ఆశ్చర్యాన్ని కలిగించింది.

'గుర్తింపు' అనేది మనిషికి ఓ దివ్యౌషధం అని ఎందరికి తెలుస్తుంది?!

■

